క్లుప్తంగా

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



నిజామాబాద్‌రూరల్: రూరల్ పరిధిలోని గూప న్‌పల్లిలోగల మురళీకృష్ణ ఆలయం వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కంఠేశ్వర్ వద్ద గల పొద్దుటూరి, నీలకంఠేశ్వర, అల్లోల్ల అపార్టమెంట్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం నగరానికి వచ్చిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో మురళీకృష్ణ ఆలయం వద్ద ఉన్న సిగ్నాల్స్‌ను తొలగించారని తిరిగి మళ్లీ ఏర్పాటు చేయాలని కోరారు. సిగ్నల్స్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే సిగ్నల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వచనాలయాన్ని కాపాడుకుందాం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని బాపూజీ వచనాలయాన్ని పార్టీలకు అతీతంగా కాపాడుకోవడానికి అందరం కలిసి పోరాడాలని బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ కోనేరు సాయికుమార్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వచనాలయం నూతన కమిటీ అక్రమ మార్గంలో గెలిచిందన్నారు. వచనాలయ పరిరక్షణ సమితికి పూర్తిగా సహకరిస్తామని సీపీఎం పార్టీ కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. సీపీఐ నాయకుడు ఓమయ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు శివ, న్యాయవాది రవీందర్ మాట్లాడుతూ.. సమితికి అండగా ఉంటామని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 'ఆశా వర్కర్ల బస్సు జాతా' కార్యక్రమ వాల్‌పోస్టర్లను సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ ప్రతినిధి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 31 వరకు బస్సు జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆశా వర్కర్లకు నెలకు రూ. 18వేల వేతనం ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈనెల 19న జిల్లాకేంద్రానికి బస్సు జాత రానుందన్నారు. ఆవా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రేణుక, రాధా, సరిత, లక్ష్మి, విజయలు పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడించాలి



నిజామాబాద్ సిటీ: దేశంలో మతోన్మాద రాజకీయ పార్టీలను ఓడించాలని మార్క్సిస్టు-అంబేడ్కరిస్టు విశ్లేషకులు సాదు మాల్యాద్రి అన్నారు. ఇప్పటికీ దేశంలో కుల వివక్ష, అసమానతలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బీఎల్‌ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో ఆదివారం ఆయన పాల్గొని, మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విధానాలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రమాదమని అన్నారు. మద్దతు ధర కోసం ఉద్యమించిన రైతులపై మోదీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణిచివేత చర్యలకు పాల్పడటం అప్రజాస్వామ్యమన్నారు. నాయకులు వడ్ల సాయికృష్ణ, ముద్రకోల ఆంజనేయులు, పోశవ్వ, కళ, అరుణ, దండి వెంకట్, సిద్దిరాములు, సబ్బని లత, జగదీష్, మహిమూద్, నాగారపు, ఎల్లయ్య, అజయ్, మనున్, జీజాబాయి, పద్మిని వాగ్మారే, సయ్యద్ పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

రెంజల్(బోధన్): అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ నెల 10న నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు చెప్పినా, ఇప్పటివరకు విడుదల చేయడం లేదని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ డైరెక్టర్ మౌలానా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే నీటిని విడుదల చేస్తే పంటల సాగుకు అవకాశం లభిస్తుందన్నారు. అధికారులు త్వరగా ఎత్తిపోతల నీటిని విడుదల చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు



నగరంలోని గురుదత్త నిలయంలో డోలారోహణం నిర్వహిస్తున్న భక్తులు



నగరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో..



డిచ్‌పల్లి మండలంలో..



మాధవనగర్‌లోని దత్తసాయిబాబా ఆలయంలో..

నిజామాబాద్ రూరల్/డిచ్‌పల్లి: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం దత్తాత్రేయ జయంతిని భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లోని దత్తాత్రేయ ఆలయాలు, ఆశ్రమాల్లో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం భజనలు, డోలారోహణం, పల్లకీసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీలు, వీడీసీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే సాయిబాబా ఆలయాల్లోనూ దత్త పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

హైందవ సంస్కృతిని కాపాడుకోవాలి



వినాయక్‌నగర్‌లోని శిరిడి సాయి కృపనగర్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

నిజామాబాద్ రూరల్: హైందవ సంస్కృతికి హిందువులు కాపాడుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. నగరంలోని వినాయక్‌నగర్ సద్గురు దామం ధార్మిక సేవా సంస్థ దత్తాత్రేయుడి ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యాక్రమాలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. హైందవ సంస్కృతిలో దత్త జయంతికి ప్రత్యేక స్థానం ఉందని, అందుకే దేశవ్యాప్తంగా ఈ జయంతిని హిందువులంతా ఏకతాటిపై నిలిచి వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దత్తాత్రేయుడు మానవ అవతారంలో త్రిమూర్తి స్వరూపుడిగా ఎంతోమందిని ఉద్ధరించారని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అప్పల ప్రసాద్, కార్పొరేటర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని దత్తాత్రేయ ఆలయంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



నగరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



నగరంలోని దత్తాత్రేయ ఆలయంలో..

ఆధ్యాత్మికం

■ **18నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు**



సిరికొండ: మండలంలోని సర్పల్లితండాలో నూతనంగా నిర్మించిన జగదాంబ దేవి, సేవాలాల్, రామారావు మహరాజ్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను ఈ నెల 18నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న విగ్రహాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, 19న అభిషేకం ఇతర పూజలు, 20న విగ్రహ ప్రతిష్ఠాపన, శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు వారు ఆదివారం తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు లిపారు.

■ **వైభవంగా మల్లన్న జాతర**



సిరికొండ: మండల కేంద్రంలో పెద్దాపురం మల్లన్న ఆలయంలో వార్షిక ఉత్సవాలు(జాతర) ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పట్నాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నుంచి భక్తులు తడిబట్టలతో నడిచారు. అనంతరం మల్లన్న కల్యాణం వైభవంగా నిర్వహించారు. బోనాలను తీసి మల్లన్నకు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

■ **రామాలయంలో అన్నదానం**



నిజామాబాద్ రూరల్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో గల కోదండ రామాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా రాజరాజేశ్వర పౌర్ణమి అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంఘం అధ్యక్షుడు కొండ నాగేందర్ గుప్తా, కోశాధికారి బేగం రాజు, కార్యదర్శి శివకుమార్, కార్యవర్గ సభ్యులున్నారు.

■ **మల్లన్న స్వామి రథోత్సవం**





జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో మల్లన్న స్వామి, తొర్లికొండలో కొమరవెల్లి మల్లన్న స్వామి జాతర రథోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మల్లన్న జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు సిడిని ఊరేగించారు. గ్రామంలో సిడిని లాగుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయం చుట్టూ తిప్పారు. ఉత్సవాల్లో భాగంగా సిడిని బంతి పూలతో అలంకరించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

■ **నేటినుంచి తిరుప్పావై ప్రవచనములు**

నిజామాబాద్ రూరల్: నగరంలోని బ్రహ్మపురి లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం, చక్రం గుళ్లో సోమవారం నుంచి ధనుర్మాస సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుప్పావై దివ్య ప్రబంధం ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాలై నాగరాజు ఆచార్య ఆదివారం తెలిపారు. నేటి నుంచి జనవరి 14వరకు ప్రతి రోజు సాయంకాలం 6గం.ల నుంచి 8గం.ల వరకు సేనాపతి సంపత్ కుమార్ ఆచార్యులు ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఉంటుందని, ఆ తర్వాత తీర్థ ప్రసాదములు ఇవ్వబడతాయన్నారు.

సొంతంగా తూముకు మరమ్మతులు

- మునలమ్మ చెరువులో పనులు చేయిస్తున్న మోర్తాడ్ వీడీసీ
- ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతోనే..



తూంగేట్ వద్ద మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మోర్తాడ్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్ల శని అన్నట్లు తయారైంది మోర్తాడ్‌లోని మునలమ్మ చెరువు పరిస్థితి. చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నా నీటిని పంట పొలాలకు అందించడానికి తూంగేట్ తెరిచే పరిస్థితి లేకపోయింది. తూంగేట్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. ఈక్రమంలో మోర్తాడ్ వీడీసీ ఆధ్వర్యంలో సొంత నిధులతో మరమ్మతులను చేపట్టారు. ఇందుకోసం ఆదివారం విశాఖపట్నం నుంచి కార్మికులను సైతం రప్పించారు.

ఇదీ పరిస్థితి..

మునలమ్మ చెరువులో వర్షం వల్ల వచ్చే నీటితోపాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వచ్చి చేరుతుంది. ఈ చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది.

కానీ చెరువు తూంగేట్ గత కొన్ని నెలలుగా తెరుచుకోకపోవడంతో సాగునీటిని అందించే పరిస్థితి లేకపోయింది. ఈక్రమంలో రైతులు బోరుబావుల ద్వారానే సాగునీటిని అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసుకోవాల్సి వచ్చింది. గతంలో రూ.3కోట్ల నిధులతో చెరువు మరమ్మతులు చేసినా తూంగేట్ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. తూంకు గతంలోనూ ఆయకట్టు రైతులు సొంతంగా నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వీడీసీ ఆధ్వర్యంలో తూంకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇందుకోసం విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించారు. వారు చెరువులో దిగి గంటల తరబడి మరమ్మతులు చేస్తేనే గేట్ తెరుచుకునే పరిస్థితి ఉంది. కార్మికులు ఎక్కువ సమయం నీటిలో ఉండటానికి ఆక్సిజన్‌తోపాటు, ప్రత్యేక టార్చిలైట్లు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చారు. మరమ్మతులకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు కావచ్చని అంచనా వేస్తున్నారు. యాసంగి వరి సాగుకు రైతులు సన్నద్ధం కావడంతో చెరువు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇందుకోసం వీడీసీ సొంతంగా మరమ్మతులు చేయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల ప్రయోజనం కోసమే..



రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని మునలమ్మ చెరువుకు సొంతంగా మరమ్మతులు చేయిస్తున్నాం. స్థానికంగా ఉన్న కార్మికులతో మరమ్మతులు చేయించాలని ప్రయత్నించాం. వారితో సాధ్యం కాకపోవడంతో విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించాం. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

– జక్కం అశోక్, వీడీసీ అధ్యక్షుడు, మోర్తాడ్

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం గ్రామస్తుల సమక్షంలో ఎన్నుకున్నారు. వీడీసీ చైర్మన్‌గా రాయిడి అశోక్, రైటర్‌గా దశరథ్‌యాదవ్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం గ్రామస్తులు వారిని సన్మానించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో, ప్రజల సమస్యలపై పోరాడుతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

రేపటి నుంచి శ్రీరామ స్వర్ణ పాదుకలతో శోభాయాత్ర



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్ నుంచి అయోధ్య వరకు ఈనెల 17నుంచి 14రోజుల పాటు రామరాజ్యం ఫౌండేషన్, రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ రామ స్వర్ణ పాదుకలతో శోభాయాత్ర కొనసాగుతుందని రామరాజ్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు నంగి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో ఆదివారం కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈనెల 19న సాయంత్రం ఆర్మూర్ మీదుగా శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. సురేష్ ఆత్మారాం మహారాజ్, అ య్యప్పసేవా సమితి అధ్యక్షుడు పెంట జలంధర్, గురు స్వామి నగేష్‌శర్మ, అయ్యప్ప స్వా ములు మాసలా సత్యనారాయణ, సురేష్, మీసాల రాజేశ్వర్, శ్రావణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల్లో మాలలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య

నిజామాబాద్‌నాగారం: కాంగ్రెస్ పార్టీకి మాలలు అండగా ఉన్నారని, నామినేట్ పదవులతోపాటు, యూనివర్సిటీ వైస్ చైర్మన్ పదవుల్లో తమకు న్యాయం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాలలకు మరో మంత్రి పదవి ఇవ్వాలన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ నుంచి మాలలకు ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 కార్పొరేషన్‌లకు చైర్మన్లను ఇచ్చారని, వాటిలో ఒక్కటి కూడా మాలలకు ఇవ్వలేదన్నారు. టీజీపీఎస్సీలో సభ్యులుగా, యూనివర్సిటీల వైస్ చైర్మన్‌ల పదవులు ఇవ్వాలన్నారు. కుల గణన జరిగిన తర్వాత జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ, ఉద్యోగ పరంగా అవకాశాలు కల్పించాలన్నారు. అప్పటి వరకు వర్గీకరణ అంశాన్ని నిలిపివేయాలన్నారు. నాయకులు చొక్కం దేవిదాస్, వినయ్, గైని సాగర్, బండిపోశెట్టి, గోపు మురళి, గంగాధర్, చంద్రకాంతి, నీరడిసాయిలు, నారాయణ, గంగాధర్, విజయ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష



ధర్మారం(బి)లోని గురుకుల పాఠశాల/కళాశాల పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



తెలంగాణ యూనివర్సిటీ పరీక్ష కేంద్రం వద్ద..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల పరిధిలో ఆదివారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని తెలంగాణ యూనివర్సిటీతోపాటు ధర్మారం(బి) గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌గా గ్రూప్-2 పరీక్షలు జరిగాయి. మొత్తం 1480 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఉదయం జరిగిన పరీక్షకు 681 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 682 మంది హాజరయ్యారు.

రైతు వ్యతిరేక విధానాలను ఖండిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఖండిద్దామని ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్ భవన్‌లో ఆదివారం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల శాంతియుత పాదయాత్రను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. రైతులను చూసి మోదీ సర్కార్ భయపడుతుందన్నారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి మద్దతుగా అన్ని పక్షాలు, రైతులు, కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. నాయకులు రామకృష్ణ, పెద్ది వెంకట్రాములు, గంగారాం, వేల్పూర్ భూమయ్య, దేవరాం, గంగాధర్, గుమ్ముల గంగాధర్, కిషన్, పల్లపు వెంకటేష్, సాయరెడ్డి, పుట్టి నడ్పి నాగన్న, రాజన్న, బాబన్న, దామోదర్, రమేష్, గంగాధర్, అనిస్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్, తపాస్ నాయకులు కోరారు. నగరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలేదీక్షలు ఆదివారం తొమ్మిదోరోజు కొనసాగాయి. ఈసందర్భంగా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వారి దీక్షలకు యూటీఎఫ్ నాయకులు సత్యానంద్, రమేష్, తపాస్ నాయకులు వేర్వేరుగా మద్దతు పలికారు. ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,000	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	72,890	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	గాజరుగడ్డ	50	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	30	50	దోసకాయ	30	50
దొండకాయ	35	60	ఆలుగడ్డ	35	50
బీర్నిసుకాయ	35	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	30	60	గోబిపువ్వు	50	90
వంకాయ	10	20	బీట్‌రూట్	50	90
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	20	40
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-1.30,7.00
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-11.00,4.30, 10.00
స్క్రీన్-3	మిస్‌యూ(తెలుగు)-10.40,1.20, 7.50,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
స్క్రీన్-2	ఫియర్(తెలుగు)-11.45 మిస్‌యూ(తెలుగు)-2.20 పుష్ప-2 (తెలుగు)-5.10,9.15
స్క్రీన్-3	ప్రణయ గోదారి(తెలుగు)-11.10 పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
స్క్రీన్-4	పుష్ప-2(హిందీ)-10.00 పని(తెలుగు) -2.05 మిస్‌యూ-5.10 10.35 ఫియర్(తెలుగు)- 10.35
లలితామహల్	మిస్‌యూ (తెలుగు)
దేవి	పని(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)